ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 164
శనివారం 14 డిసెంబర్ 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## బంతిని చూసి బాదడమే ఇప్పటి జనరేషన్

టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్



.. వివరాలు 7లో



## అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్

### భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్?

### ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి



న్యూఢిల్లీ,డిసెంబర్13 : అంతరిక్షంలో తిరుగుతున్న ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ ఆస్టరాయిడ్ ఢీకొంటే దారుణమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఆస్టరాయిడ్ పై ఇస్రో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తాజాగా వెల్లడించారు. అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్ భవిష్యత్తులో భూమికి

మిగతా 2 లో

## అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట

### మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు



- పుష్ప అరెస్ట్.. 14 రోజుల రిమాండ్
- గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్
- సోమవారం విచారిస్తామన్న హైకోర్టు
- పుష్ప అరెస్ట్‌పై పిటిషనర్ ఆందోళన
- కేసు ఉపసంహరించుకుంటానని వీడియో విడుదల

.. వివరాలు 2లో




## జూన్ 15న నీట్ పీజీ పరీక్ష

నీట్ పీజీ 2025 పరీక్ష తేదీ ప్రకటన



## నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

### పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణమే ఇవ్వండి

- ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి
- రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షంగా ఉన్నాయి
- మరోసారి సమీక్షించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి
- నిర్మలా సీతారామన్ ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని వినతి
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ
- పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చ
- కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీకై విజ్ఞప్తి



న్యూఢిల్లీ,డిసెంబర్13 : తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల

మిగతా 2 లో

## చట్టం తనపని తాను చేసుకు పోతుంది

అల్లు అరెస్ట్ విషయం తన ప్రమేయం లేదు

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ స్పష్టీకరణ

03

## రైతులకు ఆర్బీఐ శుభవార్త


- రైతులకిచ్చే రుణ పరిమితి పెంపు
- రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షల పరిమితిని పెంపు
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్బీఐ




రైతులకు ఆర్బీఐ శుభవార్త తెలిపింది. వ్యవసాయ అవసరాలకు, పంటల సాగుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు ఇవ్వాల్సిన గరిష్ఠ రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ1.60 లక్షల నుంచి రూ.2లక్షలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే నెల ఒకటిలోగా ఈ ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది.

న్యూఢిల్లీ,డిసెంబర్13 : రుణ పరిమితి పెంచినట్లు రైతులం దరికీ తెలిసేలా అన్ని మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపింది.వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టేవారికి కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని పేర్కొంది. పంటల సాగుకు రైతులు పెడుతున్న వ్యయం, ద్రవ్యోల్బణం పెరుగుదలను పరిశీలిస్తూ ఆర్బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తోంది. 2004లో ఈ రుణం పరిమితి కేవలం రూ.10వేలే

మిగతా 2 లో



## కేటీఆర్‌పై ఫార్ములా అవినీతి ఆరోపణలు

### కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్,డిసెంబర్ 13 : తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం

మిగతా 2 లో

## ప్రజల్లో నీతి... నిజాయితీ పెరగాలి: దత్తన్న

### గుట్టలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేక పూజలు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రజలు ధార్మికత... నైతిక విలువలు... నీతి నిజాయితీ అలవర్చుకున్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుం దని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు వివిధ శాఖల అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం గవర్నర్ కు ఆశీర్వచనం జరిపారు. స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బహూకరించారు. శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో హర్యాన గవర్నర్ మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావన విస్తృతం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. నీతి నిజాయితీ అలవర్చుకున్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలని వివరించారు. నీతి నిజాయితీతో మెలగాలని హితోపలికారు. యువత డ్రగ్స్ నిర్మూలన దిశ వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఆడబిడ్డలపై అత్యాచారాలు అరికట్టడంలో దేవాలయాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని చెప్పారు. ఇలాంటి పవిత్రత విస్తృతం కావలసిన అవసరమున్నదని చెప్పారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ సన్నిధి నుంచి నైతిక విలువల పెంపుకు సంబంధించిన విషయం ప్రచారం చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి దేశవ్యాప్తంగా ధర్మయాగ కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా



అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, నర్ల నర్సింగరావు, వేముల అశోక్, చందా మహేందర్ గుప్తా, ప్రముఖ న్యాయవాది విజయభాస్కర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు రచ్చ శ్రీనివాస్, రాఘవుల నరేందర్, రంగ సత్యం, రంగ రేఖ, యాదగిరిగుట్ట మండల నాయకులు రాజమణి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం
14 డిసెంబర్
2024







# పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

**హైదరాబాద్,డిసెంబర్ 13 :** హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఎర్రకోటను అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్

**న్యూఢిల్లీ, డిసెంబర్13 :** ఎర్రకోటను తమకు అప్పగించాలని కోరుతూ మొఘల్ వారసులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎర్రకోటను తమ పూర్వీకులు నిర్మించారని, దానిని ప్రభుత్వం తమకు ఇచ్చేయాలంటూ మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులో 2021లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు దానిని కొట్టివేసింది. గతంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తమ పూర్వీకుల నుంచి అక్రమంగా తీసుకున్న ఎర్రకోటను తమకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. మొదటి స్వాతంత్ర్య యుద్ధం అనంతరం మొఘలుల ఆస్తులు, ఎర్రకోట వంటి కట్టడాలను బ్రిటిష్ వారు ఆక్రమించుకున్నారని, దీంతో దేశం విడిచి వెళ్లిపోయిన నాటి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 1862లో మృతి చెందినట్లు పిటిషన్‌లో తెలిపారు.వారు నిర్మించిన ఎర్రకోటను ప్రభుత్వం ఆక్రమించుకుందని పేర్కొన్నారు. తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరారు. ఆస్తిని తమకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకుంటే అందుకు పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... ఆమె అప్పీల్‌ను తోసిపుచ్చింది.

# మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు



**హైదరాబాద్, డిసెంబర్ 13 :** నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్?పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం తిరస్కరించింది. జల్?పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ వేశారు. అయితే మోహన్‌బాబు అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

# ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులలో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

# అంతరిక్షంలో తిరుగుతున్న అపోఫిస్

మొదటి పేజీ తరువాయి

అత్యంత సమీపంగా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 450 మీటర్ల పొడవు, 170 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆస్టరాయిడ్... 2029 ఏప్రిల్ 13న భూమికి అత్యంత దగ్గరగా అంటే.. కేవలం 32 వేల కిలోమీటర్ల సమీపం నుంచి దూసుకువెళుతుందని తేల్చారు. అంటే భూమి చుట్టూ స్థిర కక్ష్యలో తిరిగే కమ్యూనికేషన్ శాటిలైట్ల కంటే కూడా ఇది దగ్గరగా వస్తుండడం గమనార్హం. అపోఫిస్ మన యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య కంటే పెద్దదని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు. అపోఫిస్ భూమిని ఢీకొట్టే పరిస్థితి, దాని గమనం, ఇతర అంశాలపై ఇస్రోలోని 'నేత్ర (నెట్ వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ అండ్ అనాలసిస్)' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో నాసాకు చెందిన ఒసిరిస్ ఆర్ఈఎక్స్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రామ్సెస్ విభాగాలతో ఆస్టరాయిడ్లపై పరిశోధనలో కలసి ముందుకువెళుతున్నట్టు వివరించారు.

# నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

మొదటి పేజీ తరువాయి

విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్ %-% కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు.అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనక బడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు.విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాల పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్షత చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలలో పాల్గొని తమ వాణి వినిపించారు.



## చట్టం తన పని తాను చేసుకుపోతుంది

### అల్లు అరెస్ట్ విషయం తన ప్రమేయం లేదు.. సిఎం రేవంత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 :** టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

# రైతులకు ఆర్బీఐ శుభవార్త

మొదటి పేజీ తరువాయి




ఉంది. 20ఏళ్ల వ్యవధిలో రైతులకు పంట సాగు ఖర్చులు 20 రేట్లు పెరిగినట్లు అర్థమవుతుందని సీనియర్ బ్యాంకు ఉన్నాతాధికారి ఒకరు ఈటీవీ భారత్‌కు తెలిపారు. సాధారణంగా భూ యజమానులు పంట సాగుచేసినా సాగు చేయకున్నా బ్యాంకుల నుంచి పంటరుణం తీసుకుంటున్నారన్నారు. ఇందుకు ఎలాంటి పూచీకత్తును బ్యాంకులు తీసుకోవద్దని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయిన ప్పటికీ కొన్ని బ్యాంకులు పాస్? పుస్తకాలను పూచీకత్తు కింద పెట్టుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 30శాతానికి పైగా భూములను యజమానులు కౌలుకు ఇస్తున్నారు. కౌలుదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఉండవనే కారణంగా బ్యాంకులు వారికి పంటరుణాలు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో పూచీకత్తు అడగకుండానే పంటల సాగుకు రుణం ఇవ్వాలని ఆర్బీఐ ఎప్పటికప్పుడు ఇలా ఆదేశాలిస్తున్న చాలా బ్యాంకులు ఈ విషయాన్ని అమలు చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాకట్టు లేకుండా కౌలు రైతులకు పంటరుణాలు అందక, ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని ఆర్థికభారంతో నలిగిపోతున్నారని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఈటీవీ భారత్‌తో అన్నారు. వారికి కూడా పూచీకత్తు లేకుండా పంట రుణాలు ఇవ్వా లని బ్యాంకులను కోరినట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మాదిరిగా ఎంతమందికి రుణాలు ఇచ్చారని కమిషన్‌కు వివరాలు అందజేయాలని బ్యాంకులను కోరినట్లు వివరించారు. భూమి ఉన్నా లేకున్నా వ్యవసాయ సంబంధ వ్యాపారం చేయాలి అనుకుంటే లేదా అగ్రి క్లినిక్ ఏర్పాటు చేయదలుచుకుంటే తాకట్టు లేకుండా రూ.5లక్షల వరకూ లోన్ ఇవ్వాలని 2004 మే 18న రిజర్వ్? బ్యాంకు ఆదేశాలిచ్చింది. అగ్రి క్లినిక్ అంటే పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలను రైతులకు ఇవ్వడమేకాకుండా వ్యవసాయనికి అవసరమైన అధునాతన సామగ్రిని విక్రయించడానికి నిరుద్యోగులు ఏర్పాటు చేసుకునే వ్యవసాయ సేవా సంస్థ. ఇలాంటి సేవా సంస్థలు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నాయి. నిరుద్యోగులు అటు రైతులకు సేవలందిస్తూ ఇటు స్వయం ఉపాధి పొందుతున్నారు. తెలంగాణలో బ్యాంకులు పూచీకత్తు లేకుండా ఈ రుణాలను ఇవ్వకపోవడం వల్ల వీటిని ఏర్పాటు చేయడం నిరుద్యోగులకు సాధ్యపడటం లేదని అధికారులు తెలిపారు.

# అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

### భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు

### ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల



**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 :** ఫోర్బ్స్ 2024 సంవత్సరానికి గాను విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమం తమైన మహిళల జాబితాలో భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు దక్కింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి ఫోర్బ్స్ జాబితాలో నిర్మలా సీతారామన్ ఉండడం వరుసగా ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఫోర్బ్స్ - ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మరో నాలుగు స్థానాలు ఎగబాకడం విశే షం. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌ప ర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందర్ షా తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె ఫోర్బ్స్ శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు. ఫోర్బ్స్ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నా రు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) లాంటివారు ఈ జాబితాలో ఉన్నారు. ఇండియాలో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు. హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్‌నాడార్ కుమార్తె రోష్నీ నాడార్ మల్హో త్రా. జులై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. 1978లో కిరణ్ మజుందర్ షా బయోకాన్‌ను నెలకొల్పా రు. ఆ తర్వాత కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరుగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహెర్‌లో ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో చంపేస్తోన్న చలి పులి

**హైదరాబాద్,డిసెంబర్ 13 :** తెలుగు రాష్ట్రాలనూ మంచు ముంచేస్తోంది. చలితీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అటు దట్టమైన మంచుతో వాహనాలు, విమానాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగ మంచు కురుస్తోంది. పొగమంచుతో విమానాల రాకపోకలపై ప్రభావం పడుతోంది. బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ వెళ్లే విమానాలు ఆలస్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పొగమంచు ప్రభావం రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇక మంచు ఎక్కువగా ఉండటంతో విమానాల రాకపోకలకు సైతం ఆటంకం కలుగుతోంది. ఆదిలాబాద్, అల్లూరి జిల్లాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. అటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఉత్తర, ఈశాన్య భారతం మీదుగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులను చలి వణికిస్తోంది. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లా వ్యాప్తంగా మంచు కమ్మేసింది. ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలికి తోడు గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో చలిపంజా విసురుతోంది. దీంతో నగర వాసులు బయటకు వచ్చేందుకు వణుకుతున్నారు..

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం 14 డిసెంబర్ 2024





# 14 న "గోపా" జనగామ జిల్లా సర్వసభ్య సమావేశం

జనగామ డిసెంబర్ 13(రోమింగ్ న్యూస్): గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గోపా జనగామ జిల్లా సర్వ సభ్య సమావేశం 14-12-2024 శనివారము ఉదయం 11 గం. లకు కెమిస్ట్స్ భవన్ నెల్లుట్ల రోడు జనగామలో ఏర్పాటు చేయనట్లు గోపా కార్యదర్శి గూడ రాజబోస్ తెలిపారు. జిల్లా అద్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగే మహాసభలో జిల్లా లోని అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు సకాలములో పాల్గొని విజయవంతం చేయగలరని కోరనైనది. మహా సభ అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రేముల యాదగిరి గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు గౌడ్ ఆద్వర్యంలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గము ఎన్నిక జరిపి ప్రకటిస్తారని కార్యదర్శి తెలిపారు.

# 3 రోజుల్లో మరో 'అల్పపీడనం'

## ఏపీకి మరోసారి వర్ష సూచన..!



అమరావతి,డిసెంబర్ 13 : గల్ఫ్ ఆఫ్ మన్నార్ దానికి అనుకుని ఉన్న కొమోరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం... ప్రస్తుతం లక్షద్వీప్, మాల్దీవుల మీదుగా ఉందని ఐఎండీ తెలిపింది. సంబంధిత ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం.. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ దిశగా కదిలి బలహీనపడే అవకాశం ఉందని వివరించింది. డిసెంబర్ 14వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రంపై ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తదుపరి 48 గంటల్లో అది అల్పపీడనంగా మారుతుందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ - వాయువ్య దిశగా తమిళనాడు తీరాల వైపు కదులుతుందని తాజా బులెటిన్ లో పేర్కొంది. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో... ఏపీలోని ఉత్తర కోస్తాలో ఇవాళ, రేపు పొడి వాతావరణం ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇక దక్షిణ కోస్తాలో ఇవాళ, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపింది. సీమలో కూడా ఇవాళ, రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని వివరించింది. ఇక ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో%ొ %. వాతావరణంలో మరిన్ని మార్పులు అవకాశం ఉంటుంది. దీంతో ఏపీలో మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండనుంది.

# చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలి






**చదువుతోనే సకల సమస్యలకు పరిష్కారం**

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**ధర్మారెడ్డిగూడెం హైస్కూల్ లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన దత్తాత్రేయ**

**అంతకుముందు యాదగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం ప్రభుత్వ హైస్కూల్ లో వడ్డే మహజన్ ఫౌండేషన్ ఛైర్మన్ వడ్డే ఉపేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గవర్నర్ ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి రోజువారి దినచర్యను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువు ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం అని, ఉన్నత విద్యను అభ్యసిస్తే కెరీర్ లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు, పేదరిక నిర్మూలన, దేశం గొప్పగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు కోరికలు కోరవద్దని, ఏమి లేకున్నా ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం, ధృడ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. స్కూల్ దశ నుండే విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సామాజిక స్పృహ పెంచుకోవడంలో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉన్నదాంట్లోనే ఇతరులకు సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఇటీవల యువత డ్రగ్స్, మత్తుపదార్థాలు, మద్యానికి బానిసలు అవుతున్నారని, అభం శుభం తెలియని విద్యార్థులు సైతం దీనికి అడిక్ట్ అవుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు వ్యసనాలను అలవాటు చేసుకోవద్దని, యోగా, వ్యాయామం, ఆధ్యాత్మిక, దైవ చింతన అలవర్చుకుంటే అన్ని రకాల వ్యసనాలు దూరమై సన్మార్గంలో పయనించడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. తమకు చెందిన బీవీ ఫౌండేషన్ ద్వారా స్కూల్ లో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేపిస్తానన్నారు. అదేవిధంగా సింగిల్ పేరెంట్ ఉన్న 20 మంది విద్యార్థులను ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన వడ్డే మహదేవ్ ఫౌండేషన్ ఛైర్మన్ వడ్డే ఉపేందర్ ను గవర్నర్ దత్తాత్రేయ అభినందించారు. ఇదే ఒరవడిని ఇకపై కూడా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఈవో సత్యనారాయణ, తహశీల్దార్ దేశ్యానాయక్, మాజీ జెడ్పీటీసీ అనురాధ, ఎంఈవో శరత్ యామిని, స్కూల్ హెచ్ఎం పద్మావతి, ఎంపీవో సలీం, వడ్డే మహదేవ్ ఫౌండేషన్ ఛైర్మన్ వడ్డే ఉపేందర్, స్కూల్ స్టాఫ్, స్థానిక బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

**నారసింహుడి సేవలో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. మొదట ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.





# మోటకొండూర్ చెరువుకు ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



మోటకొండూర్, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలోని చెరువుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరులో నియోజకవర్గంలోని ప్రతి చెరువు నింపడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రతి ఏడు ఇలాగే చెరువులు నింపి అలుగు పారిస్తా.. నాది బాధ్యత అని చెప్పారు. గడిచిన సంవత్సర కాలంలో మోట కొండూర్ మండల కేంద్రంలో దాదాపు 5కోట్ల పై చిలుకు నిధులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజాప్రభుత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా 2లక్షల రూ.రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు.
బీసీ బిడ్డ ఎమ్మెల్యేగా వస్తే కొందరు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారనీ తెలిపారు. ఆలేరు ప్రజలు ఇచ్చిన ఈ గొప్ప అవకాశన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడు తానన్నారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ మండల ప్రజలు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో ఆలేరును నంబర్ వన్ గా నిలుపుతా

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**సైదాపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రత్యేక నిధులతో ఆలేరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా నిలుపుతానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో రూ.18 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎస్ఆర్ఎస్పీ ద్వారా ఆలేరు నియోజకవర్గానికి మొట్టమొదటి సారిగా గోదావరి జలాలను తెచ్చామని తెలిపారు. నెల రోజుల వ్యవధిలో నియోజకవర్గంలో దాదాపుగా 120 చెరువులను నింపామని, వారం రోజుల్లో మిగతా చెరువులన్నింటినీ నింపుతామని అన్నారు. పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎడారిగా మారిన ఆలేరు నియోజకవర్గాన్ని.. గోదావరి జలాలతో రైతుల పొలాలను తడిపి రైతుల సాగునీటి కష్టాలను తీర్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.500 కోట్ల నిధులు తెచ్చి బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, లింకు రోడ్లు, హైలెవల్ బ్రిడ్జీలతో పాటు.. గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ బిల్డింగులను నిర్మించి అభివృద్ధికి నాంది పలికామన్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అసమర్థత కారణంగా అభివృద్ధికి నోచుకోక ఆగమైన ఆలేరును ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని, రానున్న రోజుల్లో ఆలేరును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దుంబాల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, మండల నాయకుడు శిఖ ఉపేందర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ దుంబాల సురేఖ, యాదగిరిగుట్ట పట్టణ మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్ గౌడ్, నాయకులు హేమేందర్ గౌడ్, పన్నీరు భరత్, బిక్షపతి తదితరులు ఉన్నారు.



# గుట్ట బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే బీర్ల



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలో గల బీసీ హాస్టల్ ను ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట పట్టణంలో గల బీసీ బాయ్స్ హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసి హాస్టల్లో ఉన్న బాయ్స్ ను వారికి ఏవిధమైన వసతులు వున్నాయని అడిగి తెలుసుకుని వారితో పాటు సహపంక్తి భోజనం చేసారు. కార్యక్రమంలో మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. గుట్ట పట్టణ సీ.ఐ రమేష్, ఎరుకల హేమేందర్ గౌడ్, గౌలీకార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 14 డిసెంబర్ 2024



# గుట్టలో అమ్మవారికి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండపైన శుక్రవారం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారిని వజ్రవైఢూర్యాలతో అలంకరణ చేసి పట్టు వస్త్రాలు ధరింపజేసి పల్లకిపై అధిష్టింపజేసారు. అనంతరం తిరువీధులలో అమ్మవారిని ఆమె వైభవాన్ని కొనియాడుతూ అర్చకులు... వేద పండితుల వేద ఘోషలో తిరువీధి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆలయ అధికారులు ముందు వరుసలో నడుస్తుండగా సేవ కొనసాగింది. సుప్రభాత సేవతో శ్రీవారి కైంకర్యాలు మొదలయ్యాయి. అనంతరం స్వామి వారికి నిజాభిషేకం నిర్వహించారు. సహస్రనామార్చన, సుదర్శన నరసింహం హెూమము, నిత్య కళ్యాణం జరిగాయి. సాయంత్రం జరిగిన జోడు సేవలు శయనింపు సేవలతో స్వామివారి కైంకర్యాలు ముగిశాయి. ప్రతి సేవలోను భక్తులు పాల్గొని తరించారు.

**కొండపై కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ఈరోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం యశస్వి స్నిగ్ధ బృందం. వారిచే భక్తి సంగీతం నిర్వహించారు.

ఆయా కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎన్ భాస్కరరావు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దోర్భల భాస్కర శర్మ,ఏఈఓ లు గజవెల్లి రఘు, జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకులు రాజన్ బాబు, జటావత్ శంకర్ నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీస్వామి వారి ఆదాయము
రూ:- 22,31,355 /-
శ్రీ స్వామి వారికి 1100మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.
కళ్యాణ కట్ట. 55,000/-
ప్రధాన బుకింగ్ 96,550 /-
కైంకర్యములు 2901/-
సుప్రభాతం 11,500/-
బ్రేక్ దర్శనం 1,25,100/-
వ్రతాలు 1,00,800/-
వాహన పూజలు 13,200/-
VIP దర్శనం 1,96,200/-
ప్రచారశాఖ 23,000 /-
పాతగుట్ట 37,340/-
కొండపైకి వాహన ప్రవేశం 3,00,000/-
యాదఋషి నిలయం 77,116/-
సువర్ణ పుష్పార్చన 57,400/-
శివాలయం 14,150/-
శాశ్వత పూజలు nill/-
పుష్కరిణ 1000/-
ప్రసాదవిక్రయం 8,23,110/-
లాకర్స్ 280/-
అన్నదానం 13,249/-
విమాన గోపురం 13,887 /-
లీజెస్ 2,63,572/-
ఇతరములు 6,000/-





# విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు హర్షనీయం

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**సైన్స్ ఫెయిర్ ప్రేరణతో భావిశాస్త్రవేత్తలుగా విద్యార్థులు: డీఈఓ సత్యనారాయణ**

**రాయగిరి విద్యాజ్యోతిలో ముగిసిన సైన్స్ ఫెయిర్**



భువనగిరి, రోమింగ్ న్యూస్:
విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని చూసి పరిష్కార దిశగా ఆలోచించి, వినూత్న ఆవిష్కరణలు చేయడం హర్షణీయం అని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయగిరిలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన-2024-25 మరియు జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన -2023-24 కార్యక్రమం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని, ఇంకా మున్ముందు మరిన్ని అబ్బురపడే ఆవిష్కరణలు చేసే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించే విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా ఎదగాదానికి ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. సైన్స్ ఫెయిర్ విజయవంతం కావడం కోసం కృషి చేసిన అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులను ఆయన అభినందించారు.

రెండు రోజుల ప్రదర్శనలో 118 ఇన్స్పైర్ ప్రాజెక్టులు,215 సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టులు ప్రదర్శించడం జరిగింది. వాటిలో నుండి 12 ఇన్స్పైర్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సి ఈ ఓ శోభారాణి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు,విద్యా శాఖ సహాయ సంచాలకులు ప్రశాంత్ రెడ్డి,జిల్లా సైన్సు అధికారి రాజశేఖర్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడ్డ ఇన్స్పైర్ ప్రాజెక్టులు:**

1.మంగళ్‌పల్లి రేఖ
ZPHS దూదివెంకటాపూర్
(ఫార్మర్ ఫ్రెండ్లీ పోర్టబుల్ డ్రమ్ సీడర్)

2.మిట్టపల్లి స్ఫూర్తి
ZPHS కూనూర్
(బరువులేని పిల్లల బ్యాగ్)

3.సింగం వివేక్ వర్దన్
ప్రభుత్వ హై స్కూల్ బగాయత్ భోంగీర్
(GSM ఉపయోగించి వాహనం యొక్క దొంగతనానికి సూచన)

4.ఎల్. మహిపాల్
ZPHS మరియాల
( వికలాంగులకు ఉపయోగ పడే బస్సు)

5.ఎరవల్లి శివతేజ
ZPHS రామలింగంపల్లి
(సరీసృపాల కాటును నివారించడానికి సౌండ్ బజర్‌తో కూడిన కొడవలి)

6.బాతరాజు శివరామ్ చరణ్
బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్
(ఎకో ఫ్రెండ్లీ గ్రెయిన్స్ ప్రొటెక్టర్)

7.కందుకూరి నందిని,
జోసెఫ్ వెబర్ హై స్కూల్
(సౌరశక్తితో నడిచే బహుళ ప్రయోజన వ్యవసాయ యంత్రం)

8.జి.ధనశ్రీ
ZPHS అడ్డగూడూరు
(వరి రైతుల కోసం స్మార్ట్ మరియు సింపుల్ డ్రమ్ సీడర్)

9.ఇంద్రపాల వైష్ణవి,
ZPHS నెమిల, రాజపేట మండలం
(ఎరువుల లక్ష్యం లేకుండా కీటకాలను చంపే విద్యుత్ యంత్రం)

10.బోల్ల సంజయ్ కుమార్ రెడ్డి,
ZPHS రాజాపేట
(కల్వర్టులపై నీటి ప్రవాహం నుండి రక్షించే పరికరం)

11.పబ్బు భావన,
తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, వలిగొండ
(వ్యవసాయంలో రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన డెకార్టికేటర్)

12.బట్టు పల్లవి,
MPUPS తురకపల్లి, వలిగొండ
(IR సెన్సార్ ఉపయోగించి ప్రమాద నివారణ పరికరం)





# ప్రార్థనా స్థలాల చట్టంపై పదే పదే చర్చ ఎందుకు?



భారతదేశం లౌకిక దేశం. పౌరులు స్వేచ్ఛగా తమ మతాలను ఆచరించవచ్చు. మత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటం ప్రభుత్వాల విధి. అలాగే మతం ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఇక, మత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో చట్టాలు ఉన్నాయి. వాటిలో

ప్రముఖమైనది ప్రార్థనా స్థలాల చట్టం. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అస్థిత్వంలో ఉన్న మతపరమైన కట్టడాలు. వాటి గుర్తింపు, స్వభావాన్ని, నిర్మాణాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది. మతపరమైన కట్టడాలు అంటే అవి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు...ఏవైనా కావచ్చు, 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వాటి స్వరూపం ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మంది రం నిర్మించాలని బీజేపీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమం బలం పుంజుకోవడంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో 'ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ (స్పెషల్ ప్రొవిజన్స్)' చట్టం తీసుకొచ్చింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీనిని గట్టిగా వ్యతిరేకించింది. 1991లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు వాటిని విచారిస్తోంది. కాగా, మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశిం చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధన లను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రార్థనా స్థలాల చట్టం1991 మీద దాఖలైన పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చెప్పబోయే తీర్పు మీద దేశంలో ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న డజన్ల కొద్దీ ప్రార్థనాలయాల భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇందులో ఎక్కువ భాగం కట్టడాలు ముస్లింలకు చెందినవి. వీటి మీద హిందూ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిలో జ్ఞానవాపి, షాహి ఈద్గా, వారణాసి, మధురలోని రెండు వివాదాస్పద మసీదులు ఉన్నాయి. రెండు వారాల కిందట అజ్మీర్ దర్గా విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అజ్మీర్‌లో ప్రతిరోజూ వేలమంది సందర్శించే 13వ శతాబ్దానికి చెందిన ఈ సూఫీ మందిరాన్ని హిందూ ఆలయం మీద నిర్మించారని కోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని కోర్టు

ఆదేశించడంతో హింస చెలరేగింది. ఇందులో నలుగురు మరణించారు. సర్వే నిర్వహించాలన్న కోర్టు నిర్ణయంపై ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కోర్టులు సర్వేకు ఆదేశాలు జారీ చేసినప్పుడల్లా ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే జరిగింది. 17వ శతాబ్దంలో కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మసీదు నిర్మించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. జ్ఞానవాపి మసీదులో సర్వే నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలను ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఇది 1991 ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమనేది వారి వాదన. అయితే 2022లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి

డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ సర్వేను ఆపాలని చెప్పలేదు. 1947 ఆగస్టు 15నాటికి ఉన్నప్రార్థనాలయాల స్వభావాన్ని మార్చడానికి ప్రయత్నించనంత వరకు, వాటిపై దర్యాప్తును 1991 చట్టం నిరోధించలేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఈ ఉత్తర్వులను అనేక మంది విమర్శించారు. వివిధ ఆరోపణల వల్ల స్థలాల చారిత్రక స్థితిని నిర్ణయించడం అనేది మతాల మధ్య ఘర్షణలను, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చట్టాన్ని తొలగించినా లేక బలహీనపరిచినా అది ఇలాంటి అనేక పిటిషన్లకు గేట్లు తెరవడం లాంటిదేనని ప్రతిపక్ష నాయకులు, ముస్లిం సంఘాల నేతలు భావిస్తున్నారు. దీని వల్ల దేశంలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని అంటున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 14 డిసెంబర్ 2024





# అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

## బట్టలు కూడా వేసుకోనీయకపోవడం దారుణం

## మండిపడ్డ హోంశాఖ సహాయమంత్రి బండి



**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు. నేరుగా బెడ్‌రూంలోకి వచ్చి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ భారత సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని బండి సంజయ్ తెలిపారు. అలాంటి వ్యక్తితో కాస్త మర్యాదగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం నిజంగా విచారకరమని తెలిపారు. కానీ ఆ తొక్కిసలాట పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని ఆరోపించారు. పుష్ప ది రైజ్ ఘన విజయం తర్వాత పుష్ప 2కి విపరీతమైన క్రేజ్ వచ్చిందని.. ఆ సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయని బండి సంజయ్ తెలిపారు. అలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు సరైన ఏర్పాట్లు చేయకపోవడం నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ ఘటనలో అల్లు అర్జున్‌ను నేరస్తుడిగా చూడొద్దని.. ఆయనకు కనీస గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో అల్లు అర్జున్‌ను ఇవాళ మధ్యాహ్నం చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సుమారు రెండు గంటల పాటు అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. బన్నీ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం చిక్కడపల్లి పీఎస్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీని తర్వాత నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లారు. కాగా, అల్లు అర్జున్ అంశంలో చట్ట ప్రకారం ఫాలో అవుతున్నామని పోలీసులు తెలిపారు.

# అల్లు అర్జున్ అరెస్ట్ అక్రమం : కేటీఆర్



**హైదరాబాద్,డిసెంబర్13 :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కారం అందుకున్న స్టార్‌ను అరెస్టు చేయడం పాలకుల అభద్రతా భావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్టు చేయాలని సూచించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో ఇవాళ ఉదయం అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మార్చుతారు

## తెలంగాణ తల్లిపై సీఎం గెజిట్ ఇవ్వడం దారుణం : కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 13:** తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమంలో స్ఫూర్తి నింపిన రూపాన్ని విగ్రహంగా మలుచుకున్నామని చెప్పారు. తెలంగాణ తల్లిపై రేవంత్ రెడ్డి సర్కార్ గెజిట్ ఇవ్వడం దారణమన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా భరతమాత విగ్రహంపై గెజిట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకున్నామని, జీవో ఇస్తేనే వారి విగ్రహాలు పెడతామా అని ప్రశ్నించారు. ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి జీవో ఇచ్చారన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజలు కాదన్నారు. ఆ పార్టీది తెలంగాణ వాదం కాదని, కాంగ్రెస్ వాదమని విమర్శించారు. మీరు ముమ్మాటికీ కాంగ్రెస్ వాదులే తప్ప తెలంగాణ వాదులు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లకు ఓట్లు ఉన్నప్పుడే తెలంగాణ ప్రజలు గుర్తుకు వస్తారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకుని ప్రశ్నిస్తున్నారని, ఇందిరాగాంధీ, సోనియా, రాహుల్ కూడా బతుకమ్మ ఆడారన్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించామని చెప్పారు. జీవో కూడా విడుదల చేశామని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా తెలంగాణ తల్లిని నిలుపుకుంటామన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బతుకమ్మని అవమానించేలా మాట్లాడిన మంత్రులపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మని తొలగించి చెయ్యిగుర్తు పెట్టారని ఆరోపించారు.

# రిజర్వ్ బ్యాంక్‌కు బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి బాంబు బెదిరింపు వచ్చింది. బ్యాంకును పేల్చివేస్తామంటూ బెదిరింపు మెయిల్ రావడంతో తీవ్ర కలకలం రేగింది. అధికారిక వెబ్‌సైట్‌లో రష్యన్ భాషలో బెదిరింపులు వచ్చినట్లు ఒక ఇమెయిల్ వచ్చింది. ఆర్బీఐని బాంబుతో పేల్చివేస్తామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే మాతా రమాబాయి మార్గ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ముంబై పోలీసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కాల్ వచ్చింది. తాను లష్కరే తోయిబా సీఈఓ అని బ్యాంకును పేల్చేస్తామంటూ బెదిరించాడు. ఈరోజు తెల్లవారుజామున, ఢిల్లీలోని 6 ప్రముఖ పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. పాఠశాలలకు ఇమెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ లభించలేదని తెలిపారు. ఢిల్లీలోని ఈస్ట్ ఆఫ్ కైలాష్, సల్వాన్ స్కూల్, మోడ్రన్ స్కూల్ మరియు కేంబ్రిడ్జ్ స్కూల్‌లకు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. పోలీసులు నాలుగు పాఠశాలలకు చేరుకుని విచారణ ప్రారంభించారు.

# రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

## ఎందరో మహానుభావుల అనుభవసారం

## నెహ్రూ పేరునే ఎన్నటికీ చెరిపేయలేరు

## లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలో ప్రియాంక




**న్యూఢిల్లీ,డిసెంబర్ 13 :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. జమిలిపైనా ప్రభుత్వం ముందడుగు వేయడంతో వాడీవేడీగా చర్చ సాగింది. ఎందరో మహానుభావుల అనుభవ సారం మన రాజ్యాంగం అని అన్నారు. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె.. లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదని ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. భాజపా ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది. కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలన్నారు. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా? నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరు‘ అని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు.. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ‘ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారు‘ అని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్ర్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్ర్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. అంబేద్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే ’సురక్షా కవచం’లా ఉంది. అయితే దీన్ని బద్దలుకొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేటరల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు‘ అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.

# జగదీప్ ధన్‌కడ్, మల్లిఖార్జున్‌ఖర్గే మధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 13:** రాజ్యసభలో ఇవాళ గందరగోళం నెలకొన్నది. చైర్మన్ జగదీప్ ధన్‌కడ్.. ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మధ్య మాటల యుద్ధం సాగింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మానాలను స్వీకరించాలని విపక్షాలు కోరాయి. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ధన్‌కడ్ మాట్లాడుతూ.. గడిచిన 30 ఏండ్లలో ఎన్ని సార్లు రూల్ 267 వాడారో తనకు తెలుసు అన్నారు. మీ విజ్ఞతకే ఈ విషయాన్ని వదిలి వేస్తున్నట్లు చెప్పారు. రికార్డు స్థాయిలో రూల్ 267 కింద వాయిదా తీర్మానాలను ఇచ్చినట్లు ధన్‌కడ్ పేర్కొన్నారు. విపక్షాలు పట్టుపట్టడంతో.. చైర్మన్ ధన్‌కడ్ సీరియస్ అయ్యారు. నేను రైతు బిడ్డను, నేను ఎటువంటి బలహీనతను ప్రదర్శించబోనని ధన్‌కడ్ తెలిపారు. ఈ దేశం కోసం ప్రాణాలిస్తాను, ఓ రైతు బిడ్డ ఎలా ఈ స్థానంలో కూర్చున్నారన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. మీ వెకిలి చేష్టలు అందరికీ తెలుసు అని, నేను చాలా ఓపిక పట్టాను, కానీ నేటి రైతు కేవలం పంటపొలాలకే పరిమితం కాదు అని అన్నారు. రూల్స్‌ను చదువుకోవాలని, ఒకవేళ మోషన్ మూవ్ చేస్తే అది 14 రోజులు పడుతుందన్నారు. మీరు టైం తీసుకుని వచ్చి చర్చించండి, లేదంటే నేనే మీవద్దకు వచ్చి చర్చిస్తానన్నారు.

# మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టివేత



**సంగారెడ్డి,డిసెంబర్ 13 :** సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ తరలిస్తున్నారన్న సమాచారంతో మొగడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ లారీ డ్రగ్స్‌ను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వాటి విలువ రూ.50 కోట్లు ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓడరేవు నుంచి వాటిని ముంబైకి తరలిస్తున్నారని తెలుస్తున్నది. పట్టుబడిన డ్రగ్స్‌ను చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, క్లీనర్ పరారైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో డీఆర్ఐ, నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్, సెంట్రల్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకెళ్తున్నారు, దీనివెనక ఎవరున్నారనే విషయమై ఆరాతీస్తున్నారు.

# భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికి దిక్సూచి

## రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 13:** భారతరాజ్యాంగం ప్రతి పౌరుడికి ఒక దిక్సూచి అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చ జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభలో శుక్రవారం ఉదయం జీరో అవర్ ముగిసిన తర్వాత చర్చ ప్రారంభమైంది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిగువ సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశాన్ని ఐక్యంగా, ప్రజాస్వామ్యంగా, స్వావలంబనగా ఉంచేందుకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే, ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని అవమానించాయని మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక పథకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కాగా, శనివారం వరకూ ఈ చర్చ కొనసాగుతుంది. సభ్యులు దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇక చర్చకు ముగింపుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు సమాధానం ఇవ్వనున్నారు.

# స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు

## చివరకు లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి,డిసెంబర్ 13 :** తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు.. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. మళ్లీ అంతే బలంగా పుంజుకొన్నాయి. ఉదయం 1100 పాయింట్లకు పైగా నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్.. చివరికి 840 పాయింట్లు లాభపడడం గమనార్హం. కనిష్ఠాల నుంచి దాదాపు 2 వేల పాయింట్లు పుంజుకొంది. నిఫ్టీ 24,750 ఎగువన ముగిసింది. ముఖ్యంగా ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఈ ఉదయం 81,212.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,289.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఒకానొక దశలో 1,129 పాయింట్లు పతనమై 80,082.82 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం ట్రేడింగ్ సెషన్‌లో పుంజుకున్న సూచీ లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 82,213.92 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అలా చివరకు 843 పాయింట్ల లాభంతో 82,133.12 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఒకానొక దశలో 380 పాయింట్లు కుంగి 24,180.80 కనిష్ఠాన్ని తాకింది. చివరకు 219.60 వద్ద లాభంతో 24,768.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ తప్ప మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.94 డాలర్లు, బంగారం ఔన్సు 2,688 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 14 డిసెంబర్ 2024







# 29న కొమరవెల్లి మల్లన్న కల్యాణం

## 19 జనవరి 2025 నుంచి జాతర ప్రారంభం

## 10 ఆదివారాలపాటు కొనసాగనున్న జాతర

## రాష్ట్ర దేవాదాయశాఖ నిర్ణయం

**చేర్యాల,డిసెంబర్ 13 :** సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను వైభోవంగా నిర్ణయించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గురువారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో మంత్రి సురేఖ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ%ూ% గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు.డిసెంబర్ 29 ఉదయం 10.45 గంటలకు మల్లికార్జున స్వామి వారి కల్యాణం జరగనుంది. జనవరి 19 నుంచి 10 వారాలపాటు మార్చి 23 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు. రూ. 9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధులు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో.. మంత్రికి వివరించారు. కిరీటాల తయారీ పనుల పురోగతిలో వున్నట్లు తెలిపారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండేలా చూడాలని మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్దులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాతర జరుగుతున్నన్ని రోజులు సాయంత్రాల్లో కళాబృందాలచే ఒగ్గుకథ వంటి జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. కల్యాణోత్సవానికి వారం రోజుల ముందే సర్వసన్నద్ధంగా వుండేలా కార్యాచరణను వెంటనే అమలుపరచాలని సూచించారు.కల్యాణంతో పాటు, జాతర జరిగినన్ని రోజుల దేవాలయాన్ని దేదీప్యమానంగా మ-ుస్తాబు చేయడంతో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

# బేగంబజార్‌లో దారుణ ఘటన

## భార్యా, కుమారుడి హత్య.. ఆపై ఆత్మహత్య







**హైదరాబాద్,డిసెంబర్ 13 :** బేగంబజార్ పోలీస్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఓ భర్త తన భార్య గొంతు కోసి, కుమారుని గొంతు నులిమి హత్య చేశాడు. ఆపై అతను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణాన్ని మరో కుమారుడు చూశాడు. తల్లిని, తమ్ముణ్ణి చంపుతున్న సమయంలో భయాందోళనకు గురైన పెద్ద కుమారుడు తప్పించుకున్నాడు. సమాచారం తెలుసుకున్న బేగంబజార్ పోలీసులు క్లూస్ టీంతో సంఘటన ప్రదేశానికి చేరుకుని.. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్యలకు పాల్పడి, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మహమ్మద్ సిరాజ్ అలీ, భార్య హేలియ, కుమారుడు హైజాన్.. కుటుంబంలో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిరాజ్ భార్య, కొడుకుని హత్య చేసిన తర్వాత సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకున్నాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సిరాజ్ కుటుంబం.. బ్రతుకు దేరువు కోసం నగరానికి వచ్చారు. ఈ ఘటనకు కారణం తెలియరాలేదు. కాగా సూసైడ్ నోటులో ఏం రాశాడో తెలియదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. అతను యూపి నుంచి వచ్చి ఇక్కడ సెటిల్ అయ్యాడని తెలుస్తోంది. అలాగే హైదరాబాద్ మియాపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. నాగలక్ష్మి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఆన్ లైన్‌లో గుర్తు తెలియని మందు ఆర్డర్ చేసుకుని.. సేవించి ఆత్మహత్య చేసుకుంది. కాగా ఇటీవలే నాగలక్ష్మికి వివాహమైంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట



**హైదరాబాద్,డిసెంబర్ 13 :** సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో రోజంతా హైడ్రామా నడిచింది. ఆయనను అరెస్ట్ చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటివన్నీ చకచకా సాగిపోయాయి. అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అనంతరం తెలంగాణ హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు.. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయినందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.'అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారు' అని అల్లు అర్జున్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా? లేదా? అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టివేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్ కు రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌ను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టును సంప్రదించాలని సూచించింది. అంతకుముందు తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కి బిగ్‌షాక్ తగిలింది. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బన్నీ రావటం వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందనీ, అందుకే ఆయన్ను అరెస్టుచేశామని పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి అర్జునుకి రిమాండ్ విధించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం నాడు ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. పుష్ప-2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అరెస్టు చేయడానికి తన ఇంటికి వచ్చిన పోలీసులకు అల్లు అర్జున్ సహకరించి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానితోపాటు అక్కడ సెక్యూరిటీ వారిని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు. వైద్య పరీక్షల కోసం అల్లు అర్జున్ ను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుకెళ్లారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయన్ను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, కొవిడ్-19 టెస్ట్ కూడా చేసినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అన్ని పరీక్షల్లో ఆయనకు సాధారణ ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించామని, భద్రతా కారణాల రీత్యా ఆయనను సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ను నాంపల్లి క్రిమినల్ కోర్టుకు తరలించారు. అరెస్ట్ అంశంలో చట్టప్రకారం ముందుకెళ్తున్నామని పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల సందర్భంగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఆయన అభిమానులు, రోగులకు సహాయంగా వచ్చిన వారి బంధువులు ఎగబడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ కనిపించారు. ఆస్పత్రి సిబ్బంది కూడా అల్లు అర్జున్‌ను ఫొటోలు తీసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. అల్లు అర్జున్‌పై పలు సెక్షన్లలో కేసు నమోదైంది. దీంతో ఆయన తరపు న్యాయవాది హైకోర్టుని ఆశ్రయించారు. పుష్ప 2 ప్రీమియర్ షోలు ఈనెల 4న రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్దకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సరిగ్గా అదే సమయంలో అల్లు అర్జున్ తన సతీమణి స్నేహతో కలిసి థియేటర్‌కు వచ్చారు. థియేటర్ యాజమాన్యం ముందస్తుగా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాట్లు చేయలేదు. కాగా, బన్నీ రాకతో అక్కడ ఒక్కసారిగా సంభవించిన తొక్కిసలాటలో రేవతి (36) అనే మహిళ అక్కడికక్కడే మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ గాయపడి, ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. ఇదిలావుంటే థియేటర్ వద్ద సంభవించిన తొక్కిసలాటకు గానీ, రేవతి మృతికి గానీ అల్లు అర్జున్‌కు సంబంధం లేదనీ, మృతురాలి భర్త భాస్కర్ మీడియాకు వెల్లడించారు. తమ కేసును ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించారు. అయితే, కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడించారు. అయితే ఈ కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ బన్ని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన్ను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే అల్లు అర్జున్ తరఫు న్యాయవాది దీనిని అత్యవసర పిటిషన్‌గా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. 'అత్యవసర పిటిషన్‌ను ఉదయం 10.30 గంటలకే మెన్షన్ చేయాలి కదా' అని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. బుధవారం రోజు పిటిషన్ ఫైల్ చేశామని, క్వాష్ పిటిషన్‌ను వేసినట్లు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామని చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లంచ్ మోషన్ పిటిషన్‌గా స్వీకరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. బుధవారం పిటిషన్ దాఖలు చేసి, నెంబర్ అయినా.. కోర్టు సిబ్బంది బిజీగా ఉండడం వల్ల లిస్టులోకి రాకపోయి ఉండొచ్చని వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ మోషన్ పిటిషన్ విచారించాలనడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సోమవారం వరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు. అయితే, పోలీసుల నుంచి వివరాలు సేకరించిన తర్వాతే కోర్టుకు సమాచారం ఇస్తానని ప్రభుత్వ న్యాయవాది.. న్యాయస్థానానికి తెలిపారు. అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. దీంతో న్యాయస్థానం బన్ని పిటిషన్‌పై విచారణను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసింది. ఇదిలావుంటే సినీ నటుడు అల్లు అర్జున్‌పై నమోదైన కేసు మరో మలుపు తిరిగింది. తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన రేవతి భర్త భాస్కర్ స్పందించారు. ఈ కేసును విత్ డ్రా చేసుకుంటానని తెలిపారు. అల్లు అర్జున్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ ఘటనతో ఆయనకు సంబంధం లేదని పేర్కొన్నారు. 'నా కుమారుడు 'పుష్ప 2' సినిమా చూస్తానంటే సంధ్య థియేటర్‌కు తీసుకెళ్లా. ఇందులో అల్లు అర్జున్ తప్పేం లేదు. ఆయన్ను అరెస్టు చేయనున్నట్టు పోలీసులు నాకు సమాచారం ఇవ్వలేదు. ఆస్పత్రిలో ఉన్న నేను ఫోన్‌లో అరెస్టు వార్త చూశా. కేసు విత్‌డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా' అని భాస్కర్ ఓ వీడియోలో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లోనే అత్యధికంగా కారు ప్రమాదాలు

- మెట్రో నగరాల్లో అధికంగా ప్రమాదాలు
- వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్ ఇండెక్స్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్ 13 :** దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో గత రెండేళ్లలో హైదరాబాద్? మహానగరంలో అత్యధిక కారు ప్రమాదాలు జరిగినట్లు ప్రముఖ వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్? ఇండెక్స్-2024 పేరుతో తాజాగా నివేదికను విడుదల చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా దేశ రాజధాని దిల్లీ, పుణె, బెంగళూరు, కోల్‌కతా, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్? నగరాలున్నాయని నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలో ప్రస్తావించిన ప్రధానాంశాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దేశవ్యాప్తంగా 78 శాతం రోడ్డు ప్రమాదాలు మెట్రో నగరాల్లోనే జరుగుతున్నాయి. 2022లో అత్యధిక కారు ప్రమాదాల్లో దిల్లీ మొదటి స్థానంలో ఉంటే ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంది. దిల్లీలో పోల్చుకుంటే హైదరాబాద్‌లో 46శాతం కార్లు తక్కువ. అయినా గత రెండేళ్లలో హైదరాబాద్‌లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. హైదరాబాద్‌లో ప్రమాదాలను ఎక్కువ ఆస్కారమున్న ప్రాంతంగా మియాపూర్ నిలిచింది. దేశవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. బెంగళూరులోని బొమ్మనహల్లి, దిల్లీలోని నోయిడా, పుణెలోని మరుంజి, ముంబయిలోని మిరారోడ్, చెన్నైలోని మెడవక్కం ప్రాంతాలు మొదటి 5స్థానాల్లో ఉన్నాయి. జంతువుల కారణంగా జరిగే గమనిస్తే శునకాలతో 62%, ఆవులతో 29%, బర్రెలతో 4%, కోతులతో 3%, మేకలతో 1% చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, నిద్రలేమి, డ్రైవింగ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు కారణాలుగా తెలుస్తున్నాయి. అలాగే మెట్రో నగరాలు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ఉరుకులు పరుగుల సాగే రోడ్లపై ఎటు నుంచి ఎవరూ వస్తారో తెలియకపోవడం లాంటివి కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు. చలికాలం కావడంతో



తెల్లవారుజామున పొగమంచు కురుస్తుంటుంది. దీంతో రోడ్లపై ఏం వస్తున్నాయో లేదో అన్నది దగ్గరకి వస్తే కానీ తెలియదు. ఈ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. అందుకు వాహనాలు నడిపించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు చెబుతున్నారు. సూర్యోదయం అయ్యాకే రోడ్లపైకి రావాలని సూచిస్తున్నారు. పొగమంచు తగ్గిన తర్వాత ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం అని అంటున్నారు.



# సుందర్ గబ్బా టెస్ట్ ఆడేనా?

బ్రిస్బేన్ టెస్టు కోసం ఆస్ట్రేలియా తన ప్లేయింగ్ ఎలెవన్‌ని ఖరారు చేసింది. అయితే, టీమ్ ఇండియా ఏలాంటి ప్లేయింగ్ 11తో మైదానంలోకి రానుందో ఆసక్తిగా మారింది. ఈ క్రమంలో ఓ ఫొటోతో ఈ అంచనాలకు తెర దింపినట్టైంది. తాజాగా బయటకు వచ్చిన ఓ ఫొటోతో ప్లేయింగ్ 11పై ఓ క్లారిటీ వచ్చేసింది. వాషింగ్టన్ సుందర్ షేర్ చేసిన ఫొటో కారణంగా గబ్బా టెస్టు కోసం టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్ గురించి ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, భారత స్పిన్ ఆల్ రౌండర్ సుందర్ ఎలాంటి ఫొటోను ప్రపంచానికి అందించాడు? అతను తన %శ% హ్యాండిల్‌తో పాటు మరో 3 ఫొటోలను పోస్ట్ చేశాడు. అందులో 14 డిసెంబర్ 2024, బ్రిస్బేన్. సుందర్ ఈ పోస్ట్‌కి క్యాప్షన్‌ని ఒకే పదంలో రాశాడు. వాషింగ్టన్ సుందర్ షేర్ చేసిన ఫొటో గబ్బా టెస్ట్ కోసం టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో అతనిని చేర్చడానికి సూచనగా మారింది. భారత జట్టులో అశ్విన్ స్థానంలో సుందర్‌కు అవకాశం కల్పించవచ్చు. ఇక్కడ ఆడిన చివరి టెస్టులో భారత్ విజయంలో అతని పాత్ర నిర్ణయాత్మకమైనందున భారత జట్టు మేనేజ్‌మెంట్ దీన్ని చేయాలని ఆలోచిస్తుండవచ్చు. 2 ఇన్నింగ్స్‌లలో 84 పరుగులు చేయడం ద్వారా, పంత్, గిల్ తర్వాత అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. జట్టులోని మిగతా ఆటగాళ్ల విషయానికొస్తే, గబ్బా పిచ్ స్వభావాన్ని బట్టి చూస్తే, అందులో ఎలాంటి మార్పులకు అవకాశం లేదు. అంటే, బ్యాటింగ్, ఫాస్ట్ బౌలింగ్‌లో ఏదైనా మార్పు వచ్చే అవకాశాలు తక్కువ. అడిలైడ్‌లో ఆడిన ఆటగాళ్లే అక్కడ కూడా ఆడుతున్నారు.



## బంతిని చూసి బాదడమే ఇప్పటి జనరేషన్

### టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్

ప్రత్యర్థి బౌలర్ ఎవరా? అనేది తమ జనరేషన్ బ్యాటర్లకు అనవసరమని, బంతిని చూసి బాదడమే తమకు తెలుసని టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. తొలి రెండు టెస్ట్‌ల్లో ఇరు జట్లు చెరో విజయం సాధించడంతో సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. దాంతో గబ్బా టెస్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ మ్యాచ్ ప్రిపరేషన్స్‌ను టీమిండియా పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు. తమ ప్రిపరేషన్స్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని తాము తాజాగా ప్రారంభిస్తామని, మూడు టెస్ట్‌ల సిరీస్‌గా భావించి ఆడుతామని చెప్పాడు. 'ఒక్కసారి కూడా గెలవకపోతే బాధపడాలి. కానీ గత పర్యటనలో మేం ఇక్కడ విజయం సాధించాం. భారత గడ్డపై అదే జోరు కొనసాగించాం. ప్రత్యర్థి బౌలర్ ఎవరా? అనేది ఈ జనరేషన్‌కు అనవసరం. బంతిని చూసి ఆడటమే తెలుసు. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ అంతా బాగుంది. జట్టంతా కలిసి డిన్నర్ చేశాం. ఎంతో సరదాగా గడిపాం. అడిలైడ్‌లో మేం ఆశించిన ఫలితం దక్కలేదు. అయితే ఈ పరాజయంతో ఆందోళన పడటం లేదు. ఇక నుంచి మూడు టెస్ట్‌ల సిరీస్‌గా భావించి ఆడుతాం. గబ్బా టెస్ట్‌లో గెలిస్తే.. మెల్‌బోర్న్, సిడ్నీలోనూ పైచేయి సాధిస్తాం. గత సిరీస్‌లోనూ అడిలైడ్‌లో మాకు ఓ పరాజయం ఎదురైంది. కానీ ఆ తర్వాత మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకున్నాం. ఇప్పుడూ కూడా అదే సానుకూల దృక్పథంతో బరిలోకి దిగుతాం. గబ్బాలో మాకు మెరుగైన రికార్డ్ ఉంది. ఇక్కడికి రాగానే మైదానం మొత్తం తిరిగాం. ఇక్కడ మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ పిచ్ కూడా బాగుంటుంది.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. వరల్డ్ చెస్ ఛాంపియన్ టైటిల్ గెలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు టీమిండియా తరఫున శుభ్‌మన్ గిల్ అభినందనలు తెలిపాడు. అతి చిన్న వయసులోనే వరల్డ్ చెస్ ఛాంపియన్ గెలవడం దేశానికే గర్వకారణమని కొనియాడాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్‌లో శుభారంభం చేసిన టీమిండియా.. ఆ జోరును మాత్రం కొనసాగించలేకపోయింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో 295 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది.



## ఆఖరి వన్డేలో వెస్టిండీస్ ఘన విజయం

### నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం

సెయింట్ కిట్స్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి వన్డేలో వెస్టిండీస్ నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 2014 తర్వాత బంగ్లాదేశ్‌పై వన్డే సిరీస్ గెలిచిన విండీస్.. మూడో వన్డేలో రికార్డు ఛేజింగ్ చేసింది. సెయింట్స్ కిట్స్ వేదికలో ఇదే అత్యుత్తమ ఛేదన. అంతేగాక వన్డే ఫార్మాట్‌లో వెస్టిండీస్ ఇదే అత్యుత్తమ మూడో ఛేదన. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు విండీస్ వరుసగా 11 వన్డేలు ఓడిపోవడం గమనార్హం. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో అయిదు వికెట్లకు 321 పరుగులు చేసింది. మహ్మదుల్లా (84 నాటౌట్‌బీ 63 బంతుల్లో, 7 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (77బీ 73 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), సౌమ్య సర్కార్ (73బీ 73 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్సర్లు), జేకర్ అలీ (62 నాటౌట్‌బీ 57 బంతుల్లో, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ రెండు వికెట్లు, మోటియ్, రూథర్‌ఫర్డ్ తలో వికెట్ తీశారు. అయితే బంగ్లాదేశ్ 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.

## కమిన్స్ టీమిండియాను భయపెట్టే ప్రయత్నం

నేటి నుంచి బ్రిస్బేన్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు జరగనుంది. ఈ మైదానం ఆస్ట్రేలియా యొక్క బలమైన కోటగా పరిగణించబడుతుంది. గతసారి ఇదే మైదానంలో భారత జట్టు విజయం సాధించింది. బ్రిస్బేన్‌లో జరగనున్న మ్యాచ్‌కు ముందు కమిన్స్ టీమిండియాను భయపెట్టే ప్రయత్నం చేశాడు. భారత్ - ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు ప్రారంభం కావడానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. బ్రిస్బేన్‌లో జరగనున్న ఈ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ టీమిండియాతో మైండ్ గేమ్‌లు ఆడడం ప్రారంభించాడు. అతను తన జట్టులో ఫాంలోలేని స్టీవ్ స్మిత్ పేరును తీసుకొని భారత జట్టును భయపెట్టడానికి ప్రయత్నించాడు. నిరంతరాయంగా ఫ్లాప్ అవుతున్న స్మిత్ గురించి, కమిన్స్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడని, త్వరలో భారీ ఇన్నింగ్స్ చూడవచ్చంటూ చెప్పుకొ చ్చాడు. ఇంతలో స్మిత్ గురించి రహస్యం కూడా వెలుగులోకి వచ్చింది. స్టీవ్ స్మిత్ గత కొంతకాలంగా ఫామ్‌లో లేడు. పరుగుల కోసం వెతుకుతున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా అతను 3 ఇన్నింగ్స్‌లలో 6 సగటుతో 19 పరుగులు మాత్రమే చేయగ లిగాడు. గత 10 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో 17.91 సగటుతో 179 పరుగులు చేశాడు. అడిలైడ్ టెస్టులో, అతను 2 పరుగులు చేసిన తర్వాత జస్ప్రీత్ బుమ్రాకు బలి అయ్యాడు. అయినప్పటికీ, నెట్ ప్రాక్టీస్ సమయంలో స్మిత్ చాలా షార్ప్‌గా కనిపిస్తున్నాడని కమిన్స్ చెప్పాడు. అతనికి చాలా సమయం ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే, చాలాసార్లు ఆస్ట్రేలియా ఆటగాళ్లు ప్రత్యర్థి జట్లపై ఇలాంటి మెంటల్ ట్రిక్స్ ప్రయోగిస్తూనే ఉంటారు. అయితే, ఇది నిజం కూడా కావచ్చు. ఎందుకంటే ఈలోగా స్మిత్ తన బ్యాటింగ్ విషయంలో దిగ్గజ ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ మైఖేల్ హస్సీ నుంచి సలహా కోరినట్లు కూడా వెల్లడైంది. స్టీవ్ స్మిత్ తన ఫామ్ గురించి ఆందోళన



చెందుతున్నాడు. దీనికి సంబంధించి, అతను అడిలైడ్ టెస్టుకు ముందు మైఖేల్ హస్సీని కలిశాడు. ఈ కాలంలో తక్కువ ప్రాక్టీస్ చేయాలని స్మిత్‌కు హస్సీ సూచించాడు. మార్నస్ లాబుషాగ్నే, స్టీవ్ స్మిత్ నెట్స్‌లో చాలా ప్రాక్టీస్ చేస్తారని హస్సీ చెప్పాడు. అయితే, వయసు పెరిగే కొద్దీ ఆటగాళ్లు తక్కువ ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. 35 ఏళ్ల స్మిత్ ప్రస్తుతం శిక్షణ కంటే మానసి కంగా, శారీరకంగా తాజాగా ఉండాల్సిన అవసరం ఉం దని మైఖేల్ హస్సీ అభిప్రాయపడ్డాడు. హస్సీ ప్రకారం, అతను స్మిత్‌కు అదే సలహా ఇచ్చాడు. రెండో టెస్టులో అతని సలహాను అనుస రించి, స్మిత్ కొన్ని సెషన్లను వదిలేశాడు. కానీ ప్రయోజనం కనిపిం చలేదు. అయితే కమిన్స్ మాటలు నిజంగా నిజమైతే మాత్రం టీ మిండియాకు ఆందోళన కలిగించే విషయమే. స్మిత్ ఫామ్‌లో ఉ ంటే ఔట్ కాకుండా భారీ స్కోర్లు చేసే బ్యాట్స్‌మెన్ అని తెలిసిందే.



## యువ ఛాంపియన్ గుకేశ్‌కు తమిళనాడు సీఎం రూ.5కోట్ల నజరానా

చిన్న వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారత ఆటగాడు డి గుకేశ్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారీ నజరానా ప్రకటించారు. వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డిగ్ లిరెన్‌పై గుకేశ్ అద్భుత విజయం సాధించడంపై స్టాలిన్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 కోట్ల ప్రైజ్‌మనీని అందిస్తున్నట్లు వెల్లడించారు. 'గుకేశ్ సాధించిన అద్భుత విజయాన్ని మనం గౌరవించాలి. అతి పిన్న వయస్కుడైన ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సంతోషంలో అతడికి రూ. 5 కోట్ల ప్రైజ్ మనీని ప్రకటిస్తున్నా. జాతి గర్వపడేలా చేసిన అతడికి నా ప్రత్యేక అభినందనలు. మున్ముందూ మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటున్నా. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షిస్తున్నా" అని స్టాలిన్ పోస్టు చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు ట్రోఫీతో పాటు రూ. 11.45 కోట్ల నగదు బహుమతి దక్కింది. దీంతో అతడి నికర విలువ రూ. 8.26 కోట్ల నుంచి రూ. 21 కోట్లకు పెరిగింది. చెస్ ద్వారా అతడి ఆదాయం దాదాపు మూడు రెట్లు పెరిగినట్టైందని ఔట్‌లుక్ పేర్కొంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లిరెన్ రూ. 9.75 కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఛాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 21.17 కోట్లు. ఒక గేమ్ గెలిచిన ప్లేయర్‌కి రూ. 1.69 కోట్లు లభిస్తాయి. మూడు గేమ్‌లు నెగ్గిన గుకేశ్‌కు రూ. 5.07 కోట్లు.. రెండు గెలిచిన లిరెన్‌కు రూ. 3.38 కోట్లు దక్కాయి. మిగిలిన ప్రైజ్‌మనీని సమానంగా పంచారు.

## అంజింక్యా రహానే విధ్వంసకర బ్యాటింగ్

ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై ఫైనల్ చేరింది. బరోడాతో శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ముంబై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టీమిండియా వెటరన్ బ్యాటర్ అంజింక్యా రహానే(56 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98) విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. శశ్వాత్ రావత్(29 బంతుల్లో 4 ఫోర్లతో 33), కృనాల్ పాండ్యా(24 బంతుల్లో 4 ఫోర్లతో 30), శివాలిక్ శర్మ(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ముంబై బౌలర్లలో మోహిత్ అవస్థీ, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, తనూష్ కోటియన్, అథర్వ అంకోలేకర్ తలో వికెట్ తీయగా.. సుయాన్ష్ షెడ్గే రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ముంబై 17.2 ఓవర్లలో 4 వికెట్లకు 164 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ పృథ్వీ షా(8) విఫలమవ్వగా.. అజింక్యా రహానే, శ్రేయస్ అయ్యర్(30 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) రాణించారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ ముంగిట అయ్యర్ ఔటవ్వగా.. అజింక్యా రహానే శతకాన్ని చేజార్చుకున్నాడు. సుర్యాన్ష్ షెడ్గే విన్నింగ్ సిక్స్‌తో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.




ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News

## అనసూయ.. చీరలో హంసలాంటి అందం..

తెలుగు టెలివిజన్ ప్రపంచంలో తనదైన శైలితో ప్రేక్షకులను ఆకర్షించిన అనసూయ భరద్వాజ్, తన గ్లామర్‌తో పాటు సాంప్రదాయ లుక్స్‌లోనూ అందాన్ని హైలెట్ చేస్తూ నిత్యం ట్రెండ్ సెట్ చేస్తుంది. తాజాగా షేర్ చేసిన శారీ ఫోటోస్ లో ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరింతగా ఎలివేట్ చేశాయి. పట్టు చీరలో పింక్ బ్లౌజ్, వెండి నెక్లెస్, సంప్రదాయ ఆభరణాలతో ఆమె మరింత అందంగా మెరిసింది. అనసూయ ధరించిన శారీలోని ప్రతీ ఎలిమెంట్ ఆమె వ్యక్తిత్వాన్ని హైలైట్ చేసింది. ఆమె హెయిర్‌స్టైల్‌తో పాటు మేకప్ సింపుల్‌గా ఉండటం వల్ల లుక్ మరింత క్లాసీగా కనిపించింది. ముఖ్యంగా ఆమె ధరించిన బ్లౌజ్ డిజైన్ వినూత్నంగా ఉండటం విశేషం. ఈ ఫోటోలకు అనసూయ ఇచ్చిన క్యాప్షన్ “హంస అందం” అంటూ తన అభిమానులను విశేషంగా ఆకర్షించింది.అనసూయ కెరీర్ గురించి మాట్లాడితే, టెలివిజన్ షోస్ నుంచి సినిమాల వరకు తనదైన గుర్తింపు సంపాదించింది. పుష్పలో దక్షాయణి పాత్రతోనే కాకుండా అనేక చిత్రాల్లో ఆమె చేసిన క్యారెక్టర్స్ ఆడియన్స్‌ను మెప్పించాయి. ప్రస్తుతానికి అనసూయ పలు క్రేజీ ప్రాజెక్టులలో భాగస్వామ్యమై ఉంది. ముఖ్యంగా పుష్ప 2లో ఆమె కనిపించింది కొన్ని సీన్స్ లోనే అయినప్పటికీ ఎంతగానో ఆకట్టుకుంది. ఇలాంటి రోల్స్ లో కూడా అనసూయకి పోటీ ఎవరు రారేమో అని చెప్పవచ్చు.





## బ్లాక్ డ్రెస్‌లో అందాల సికిందర్ క్లీవేజ్‌షో!

యే మేరి లైఫ్ హై టీవీ సిరీస్‌తో ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ షామా సికిందర్. హీరోయిన్‌గా కెరీర్ ఆరంభంలో కొన్ని సినిమాలు చేసినా అవి బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావంను చూపించలేదు. పైగా నటిగా సినిమాలతో కంటే ఈమెకు సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు దక్కింది. అందుకే ఎక్కువ శాతం ఈమె సినిమాలు చేయకుండా సీరియల్స్ చేస్తూ వచ్చింది. ఇండస్ట్రీలో ఈమెకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా షామా సికిందర్ గురించిన చర్చ జరుగుతూ ఉంటుంది. వయసు పెరిగినా ఈమె అందం తగ్గకుండా మరింత పెరిగిందనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తూ ఉంటారు. 1998లో ఫిరోజ్ ఖాన్ దర్శకత్వం వహించి నిర్మించిన ప్రేమ్ ఆగ్గన్‌తో 16 ఏళ్ల వయసులోనే షామా సికిందర్ హిందీ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. సినిమాల్లో ఆఫర్ల కోసం చాలానే ప్రయత్నాలు చేసిన షామా సికిందర్ బుల్లి తెర ద్వారా వచ్చిన ఆఫర్‌ను సద్వినియోగం చేసుకుంది. అక్కడ మంచి విజయాలను సొంతం చేసుకోవడం ద్వారా ఎక్కువ గుర్తింపు లభించింది. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు, వీడియోలు ఎప్పుడూ వైరల్ అవుతున్నాయి. ఈమెకు బాలీవుడ్ నుంచి చిన్నా చితకా ఆఫర్లు వచ్చినా వాటిపై ఆసక్తి చూపించకుండా కెరీర్‌లో ముందుకు సాగడం కోసం టీవీ సిరీస్‌లను ఎంపిక చేసుకుంది.



## సూర్యతో జోడీగా..

దక్షిణాది చిత్రసీమలో త్రిష హవా నడుస్తోంది. ప్రస్తుతం ఈ భామ ఏడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ‘పొన్నియన్ సెల్వన్’ సిరీస్ చిత్రాల భారీ సక్సెస్‌తో త్రిష దశ మారిపోయింది. వరుసగా అగ్ర హీరోల చిత్రాలను అంగీకరిస్తూ బిజీబిజీగా మారింది. తాజాగా ఈ భామ అగ్ర హీరో సూర్య 45వ చిత్రంలో కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సూర్య నటిస్తున్న 45వ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సూర్య-త్రిష జోడీ విజయవంతమైన చిత్రాల్లో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత వీరు కలిసి నటిస్తుండటం విశేషం. త్రిష ప్రస్తుతం విశ్వంభర, థగ్‌లైఫ్, బ్యాడ్ అండ్ అగ్లీ వంటి భారీ చిత్రాల్లో నటిస్తున్నది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986